క్లుప్తంగా

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న వాహనం

అల్లాదుర్గం(మెదక్): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసిన సంఘటన అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు నుంచి కామారెడ్డి జిల్లా పీట్లంకు బూలోర వాహనంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారు. చిల్వెర ఐబీ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేయగా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండా పటుకున్నామని ఎస్ఐ చెప్పారు. పట్టుకున్న బియ్యాన్ని పెద్దశంకరంపేట పౌరసరఫరా గోదాంకు తరలించి, వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న కడవాత్ శ్రీనును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

అంగన్‌వాడీల్లో వైద్యపరీక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న, మహ్మద్‌నగర్‌తో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఏఎన్ఎం రాజమణి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది పిల్లలు, గర్భిణులు, బాలింతలకు చికిత్సలు చేసి అవసరం ఉన్నవారికి రోగనిరోధక టీకాలు ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రవళిక, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేశ్


నియామక పత్రం అందిస్తున్న నాయకులు

నిజాంపేట(మెదక్): మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన ఆకుల రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. తనను నమ్మి తనకు పదవిని ఇచ్చినందుకు కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సిద్ధరాములు, తీగల శ్రీనివాస్‌గౌడ్, అంజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పరిశీలన

రామాయంపేట(మెదక్): పట్టణంలో వినాయక నిమజ్జనం కోసం మున్సిపాలిటీ వారు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, మేనేజర్ శ్రీనివాస్, ఇతర సిబ్బంది సర్వయ కుంట, కొత్త చెరువులను సందర్శించారు. రహదారులపై మొరం పోయించి చెరువులవద్ద లైటింగ్ ఏర్పాటు చేయించాలని చైర్మన్ ఆదేశించారు.

బాల్యవివాహాలతో అనర్థాలు


మాట్లాడుతున్న అధికారులు

నర్సాపూర్ రూరల్: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టులు నాగమణి, కవితలు అన్నారు. మండలంలోని కాగజ్‌మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాశ్ రావు అధ్యక్షతన జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ బుధవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నంబర్లు 181, 1098, 100లకు ఫోన్ చేయాలని చెప్పారు. మానసిక సమస్యలు ఉంటే 14416 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా సాధికారత బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండలం రామంతాపూర్ శివారు సోనిదాబా సమీపంలో జాతీయ రహదారిపై ఆగస్టు 28న గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే చేగుంట పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

బంతి సాగు.. దిగుబడి బాగు

కూరగాయల సాగులో అంతర పంటగా బంతిపూలు సాగు చేస్తున్న రైతు రామకృష్ణాగౌడ్ ● వరి కంటే లాభమే అంటున్న రైతు


కంచన్‌పల్లిలో వంకాయతోటలో అంతర పంటగా బంతి సాగు చేస్తున్న రైతు రామకృష్ణాగౌడ్

కౌడిపల్లి(నర్సాపూర్): కూరగాయల సాగులో అంతర పంటగా బంతిపూల తోట సాగుచేస్తూ బంతితోట లాభాల పంట అంటున్నాడు కౌడిపల్లి మండలం కంచన్‌పల్లికి చెందిన రైతు రామకృష్ణాగౌడ్. తనకున్న మూడెకరాల్లో పొలంలో వరితో పాటు పంటమార్పిడిలో భాగంగా కూరగాయలు, ఆకుకూరలుతో పాటు అంతర పంటగా పదిగుంటల పొలంలో బంతిపూల తోట సాగు చేశాడు. వర్షాకాలం ప్రారంభంలో వంకాయ తోటలో అంతర పంటగా సాగు చేశారు. ప్రస్తుతం బంతిపూలు కోతకురాగా నాలుగు విడతలుగా తెంపి క్వింటాల్నర పూలు విక్రయించినట్లు చెప్పారు. మరో రెండునెలలు దీపావళి పండుగ వరకు పూలు పూయనున్నట్లు తెలిపారు. దీంతోపాటు వంకాయలు సైతం పక్షం రోజులలో కాతకు రానున్నాయన్నారు. కాగా బంతితోటకు దున్నడం నాటడానికి రూ. 3000వేలు, 700 బంతి మొక్కలు కొనుగోలుకు రూ. 3,500 మొత్తం రూ. 6,500 ఖర్చు చేసినట్లు చెప్పాడు. పదిగుంటల అంతర పంట సాగులో ఇప్పటివరకు క్వింటాల్నర హోల్‌సేల్‌గా విక్రయించగా.. రూ. 10,500వచ్చాయని, ఖర్చులు పోను రూ.3,500 మిగిలాయని వివరించారు. ఇంకా రెండునెలలో మరో పదివేలు రానున్నాయన్నారు. దీనికితోటు వంకాయ పంట సైతం దిగుబడి వస్తుందని అన్నారు. దీంతో పదిగుంటల వరి పంటలో కేవలం రూ. 7వేలు మాత్రమే లాభం రానుందని బంతిసాగులో రూ. 12 నుంచి రూ. 15వేల వరకు లాభం వస్తుందని చెప్పారు. పెద్ద మొత్తంలో సాగు చేస్తే వరి పంటకన్న బంతిసాగు లాభదాయకమని సంతోషం వ్యక్తం చేశారు. కూరగాయలు అమ్మితే అదనపు ఆదాయం వస్తుందన్నారు. పంట మార్పిడితో నేలకు సైతం లాభం ఉంటుందన్నారు. చీడపీడల భయం ఉండదని ఎరువులు, సస్యరక్షణ చర్యలు తక్కువేనని చెప్పారు.

16 నుంచి పీర్ బాబా ఉర్సు


విద్యుత్ కాంతుల్లో దర్గా

పుల్కల్(అందోల్) : మండల పరిధిలోని సింగూర్ గ్రామంలో ఈనెల 16, 17, 18వ తేదీల్లో హజ్రత్ మహ్మద్ పీర్ బాబా షా వలీ ఉర్సు ఉత్స వాలు నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సాహెబ్ తెలిపారు. 79 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు కుల మతాలకతీతంగా వేలాది మంది ప్రజలు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దర్గాను రంగురంగుల దీపాలతో అందంగా అలంకరించినట్లు తెలిపారు. ఎంతో పవిత్రత కల్గిన గంధం, చాదర్‌ను దర్గాలోకి తీసుకెళ్లే కీలక ఘట్టాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 17న కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం నాతే షైఫీల్ సమ, అన్నదాన వితరణ ఉంటుందని తెలియజేశారు. ముఖ్యఅతిథులు అన్నసాగర్ పీఠాధి పతి హజ్రత్ సుఫీ షా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ ఉర్ఫ్ జహీద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ పాల్గొంటారని స్పష్టం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి

– ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల


టేక్మాల్ (మెదక్): ధనూరలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేక్మాల్ (మెదక్): మంచి ఆరోగ్యం కోసం గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల తెలిపారు. పోషణ మాసం లో భాగంగా బుధవారం టేక్మాల్ మండలంలోని ధనురా గ్రామంలో పోషకాహారం పై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో డాక్టర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, పుష్ప, పోచమ్మ తదితరులు ఉన్నారు.

సమతుల ఆహార తీసుకోవాలి

పాపన్నపేట(మెదక్): బాలింతలు, గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ సక్కుబాయి సూచించారు. బుధవారం కొడుపాకలో పోషణ మాసం సందర్భంగా బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గంగమణి, పద్మ, గాజులగూడెం టీచర్లు షకీరా బేగం, అప్సరి బేగం పాల్గొన్నారు.

శివ్వంపేటలో పోషణమాసం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవంలో భాగంగా పోషణ ప్రతిజ్ఞ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి లబ్ధిదారులకు పోషకాహారం గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి

నర్సాపూర్: రైతులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతురక్షణ సమితి ప్రతినిధులు తహసీల్దార్ శ్రీనివాస్‌ను కోరారు. బుధవారం రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు చాదాగౌడ్, గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్, నాయకులు చంద్రశేకర్, రమేశ్ తదితరులు ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శ్రీనివాస్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రుణాలపై విచారణ

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి సహకార సంఘంలో రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలపై జిల్లా సహకార కార్యాలయ సీనియర్ ఇన్‌స్పెక్టర్ సంఘమేశ్వర్ విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్డిపల్లి సహకార సంఘంలో చింతకాయల విఠల్ సహకార రూ.85 వేల రుణం తీసుకోగా.. రెండు లక్షల రుణం తీసుకున్నట్లు నమోదైందని తెలిపారు. ఈ విషయంలో బాధిత రైతు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, అధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టినట్లు చెప్పారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం వివరాలను వెల్లడిస్తామని వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డితో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రణాళికతో పనిచేస్తే విజయం

జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి


మాట్లాడుతున్న సరస్వతి

నర్సాపూర్ రూరల్: ప్రణాళికాతో పనిచేస్తే విజయం సాధ్యమవుతుందని జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి మహిళా సంఘాల సహాయకులకు సూచించారు. బుధవారం నర్సాపూర్ ఐకేపీ కార్యాలయంలో గ్రామ సంఘ సహాయకుల సమావేశం ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఆమె మాట్లాడారు. ప్రతీ గ్రామ మహిళా శక్తి సంఘాలు అన్ని కార్యక్రమంలో వందశాతం ప్రగతిని సాధించాలన్నారు. బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, ఫామ్, నాన్ ఫామ్, సమస్త గత నిర్మాణం అంశాల్లో జిల్లా వ్యాప్తంగా నర్సాపూర్ మండలం ముందుండాలని తెలిపారు. మహిళా సంఘాలకు అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన సహాయ సహకారాలు నిరంతరం అందజేయాలని గ్రామ సంఘాల సహాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ సునీల్ గాంధీ, ఫీల్డ్ ఆఫీసర్ రాజేశ్, సీసీలు దేవి సింగ్, రవీందర్, ఆంజనేయులు, భాగ్య, ప్రవీణ, అకౌంటెంట్ మల్లేశం, ఆపరేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పండగ పూట తప్పని పస్తులు

పాత లింగాయపల్లిలో పంపిణీకి నోచుకోని రేషన్ బియ్యం

పాపన్నపేట(మెదక్): డీలర్ ఇష్టారాజ్యం.. అధికారులు నిర్లక్ష్యంతో పాత లింగాయపల్లి గ్రామస్తులకు ఈ నెల 10 దాటినా.. రేషన్ బియ్యం అందలేదు. దీంతో వినాయక చవితి పర్వదినం నిరుపేదలకు ఆకలినే మిగిల్చింది. వివరాల్లోకి వెళ్తే పాపన్నపేట మండల పరిధిలోని పాతలింగాయపల్లి రేషన్ డీలర్ పరిధిలో అమ్రియాతండా, సోమ్లతండా, పాతలింగాయ పల్లి గ్రామాలు ఉన్నాయి. ప్రతీ నెలా 22 నుంచి ఆ నెల చివరి వరకు పాపన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ బియ్యం తీసుకెళ్తారు. 1వ తేదీ నుంచి 10 వరకు బియ్యం పంపిణీ చేయాలి. కానీ సదరు డీలర్ మాత్రం సెప్టెంబర్ 10 వరకు బియ్యం తీసుకెళ్లలేదు. పేదలకు ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులంతా పండగపూట ఇబ్బందులు పడ్డారు. గ్రామస్తుల ఆందోళనతో చివరకు ఈ నెల 10 న డీలర్ తన మొద్దు నిద్ర వీడి, బియ్యం తీసుకెళ్లాడు. గతంలో కూడా ఈ డీలర్‌పై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో అప్పట్లో కలెక్టర్ అతన్ని సస్పెండ్ చేశారు. పాపన్నపేట తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లు సైతం పట్టించుకోలేదని గిరిజనులు ఆగ్రహం వ్యకం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సతీష్‌ను వివరణ కోరగా.. ఈ నెల 10న సదరు డీలర్ బియ్యం తీసుకెళ్లినట్లు చెప్పాడు.

ఉపాధ్యాయ వృత్తి గొప్పది


ప్రశంసా పత్రాలతో మండల ఉత్తమ ఉపాధ్యాయులు

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయ వృత్తి గొప్పదని, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ దామోదర్, తహసీల్దార్ మన్నన్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట ఎంఈఓ బుచ్యానాయక్ ఆధ్వర్యంలో మండలంలోని 14 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి, సన్మానించారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులు వేణుగోపాల్(జెడ్పీహెచ్ఎస్, చందంపేట), రాజేశ్వర్(టీజీఎంఎస్, చిన్నశంకరంపేట), నరేష్(జెడ్పీహెచ్ఎస్, దరిపల్లి), తేరిసా(కేజీబీవీ, చిన్నశంకరంపేట), కె.బాల్‌రాజ్(పీఎస్, సూరారం), ఎ.బాల్‌రాజ్(పీఎస్, మిర్జాపల్లి), శ్రీజ(యూపీఎస్, మిర్జాపల్లి), వేణుగోపాల్(పీఎస్, జంగరాయి ఎల్‌టీ), రమేష్(యూపీఎస్, గవ్వలపల్లి), దివ్య, శ్రీలత(పీఎస్,శాలిపేట), లక్ష్మణ్‌స్వామి (పీఎస్,రాజ్యాతండా), శారద (యూపీఎస్,ఖాజాపూర్), సందీప్(సీఆర్‌పీ)లను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కృష్ణవేణి, హెచ్‌ఎంలు దీప్లారాథోడ్, సాయిరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీదేవి, గీతా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోచయ్య, సత్యనారాయణ, శివప్రసాద్, హరిబాబు, శ్రీనివాస్‌రెడ్డి, ఫణింద్రచారి, ప్రవీణ్, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

షీ టీమ్‌పై అవగాహన

కొల్చారం(నర్సాపూర్): మండలంలో చిన్నఘనాపూర్ ఉన్నత పాఠశాలలో కొల్చారం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం షీ టీమ్‌పై అవగాహన కల్పించారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం పోలీస్ శాఖ వారితో ప్రత్యేకంగా షీ టీమ్ ఏర్పాటు చేస్తుందన్నారు. సదస్సులో పాఠశాల హెచ్‌ఎం ఎజాజ్ సుల్తానా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

– మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్


సూరారంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

చిన్నశంకరంపేట(మెదక్): తండ్రి, కొడుకుల మృతి దురదృష్టకరమని, వారి కుటుంబ సభ్యులను అన్ని రకాలుగా ఆదుకుంటానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. బుధవారం మండలంలోని సూరారం గ్రామంలో అటెండర్ మల్లేశం, బూదయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో వారికి అండగా నిలిచి ఆదుకుంటానన్నారు. మల్లేశం కూతురు పేరిట రూ.25 వేలు డిపాజిట్ చేస్తానని తెలిపారు. మండల కేంద్రంలో నివాస స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, రమేశ్‌గౌడ్, జీవన్, పవన్‌గౌడ్, రాజ్‌కుమార్, రాజాసింగ్, రాజేశ్ ఉన్నారు.

సాక్షి కథనాలపై డీఎస్ఓ విచారణ

ముక్కిన బియ్యం, గోదాం ఇన్‌చార్జి అక్రమాలపై ఫిర్యాదులు


రాంపూర్‌లో విచారణకు వచ్చిన డీఎస్ఓ ఎదుటే డీలర్, గోదాం ఇన్‌చార్జి వాగ్వాదం

అల్లాదుర్గం(మెదక్): బియ్యం కోత, ముక్కిన బియ్యం సరఫరా, ఈ బియ్యం మాకొద్దు అనే శీర్షికలతో సాక్షిలో వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలకు స్పందించిన మెదక్ డీఎస్ఓ సురేశ్‌రెడ్డి బుధవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో విచారణ చేపట్టారు. పెద్దశంకరంపేట గోదాం నుంచి డీలర్లకు బియ్యం పంపిణీలో 5 నుంచి 10 కేజీల కోత, ముక్కిన బియ్యం రేషన్ షాపులకు సరఫరా చేశారు. దీంతో వినియోగదారులు, డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్ఓ రాంపూర్‌లోని రేషన్ షాపును తనిఖీ చేసి విచారణ చేశారు. ముక్కిన బియ్యం ఇస్తే ఎలా తింటామని వినియోగదారులు డీఎస్ఓను ప్రశ్నించారు. బస్తాకు 5 కేజీల పైనే బియ్యం కోత విధిస్తున్నారని డీలర్లు చెప్పారు. అక్కడే ఉన్న గోదాం ఇన్‌చార్జి దత్తురెడ్డి డీలర్, వినియోగదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదాం ఇన్‌చార్జి దురుసుగా మాట్లాడటంతో గ్రామస్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

నాసిరకం బియ్యం పంపిణీ చేస్తే తిరిగి పంపాలి. రేషన్ షాపుల నుంచి బియ్యం సేకరించి ల్యాబ్‌కు పంపుతాం. గోదాం ఇన్‌చార్జిపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. – మెదక్ డీఎస్ఓ సురేశ్‌రెడ్డి

● కన్యకాపరమేశ్వరీ ఆలయంలో కుంకుమార్చన


కన్యకా పరమేశ్వరీ ఆలయంలో పూజలు చేసిన అనంతరం మహిళలు

నర్సాపూర్: నవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అందులో భాగంగా బుధవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అందులో భాగంగా ఆర్యవైశ్య మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాదం పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌లతో పాటు ఆయా పార్టీల నాయకులు గణపతిని దర్శించుకున్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం సభ్యులు నాయకులను కండువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **చేయూత**



నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో అనాథలైన ఇద్దరు ఆడపిల్లలకు యువజన సంఘాల నాయకులు అండగా నిలిచారు. బుధవారం చెర్వీరాల శ్రీనివాస్ ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. కరోనా సమయంలో అతని భార్య చనిపోయింది. ఈ బాధ మరువక ముందే ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ శ్రీనివాస్ మరణించాడు. దీంతో వీరి ఇద్దరు ఆడ బిడ్డలు అనాథలయ్యారు. గ్రామ యువజన సంఘాల నాయకులు ముందుకొచ్చి ఆ ఆడపిల్లలకు దాతల సహకారంతో రూ. 63,500 సాయం అందజేశారు.

◆ **దాతల సహకారం ఎంతో అవసరం**

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం ఎంతో అవసరమని ఎంఈఓ బుచ్చానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని గూడూర్ పాఠశాలలో విద్యార్థులకు ఎంఎస్ఎన్ ల్యాబరేటరీస్ ప్రతినిధి డాక్టర్ వంశీకృష్ణ స్టీల్ ప్లేట్స్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం మాధవి, ఉపాధ్యాయురాలు రేణుక, సీఆర్‌పీ రవీందర్ పాల్గొన్నారు.

◆ **వెల్మకన్నలో విద్యార్థులకు క్విజ్ పోటీలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం సరోజ ఆదేశాలతో ఉపాధ్యాయులు విద్యార్థులను గ్రూపులుగా ఏర్పాటు చేసి క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **ప్రతీ మహిళ మొక్కను పెంచాలి**

నిజాంపేట(మెదక్): ప్రతీ మహిళ ఒక మొక్కను పెంచాలని సీసీ స్వరూప అన్నారు. మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో వార్షిక బడ్జెట్ సమావేశం బుధవారం నిర్వహించిన్నట్లు సీసీ తెలిపారు. కార్యక్రమంలో వీఓఏ మంగ, గ్రామ అధ్యక్షురాలు నర్మద, రజిత, మజుల పాల్గొన్నారు.

◆ **గుడిసె, రేకుల షెడ్డు తొలగింపు**

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని అచ్చంపేట గ్రామంలోని సర్వే నెం. 142లో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసి నిర్మించిన గుడిసె, రేకుల షెడ్డును బుధవారం తొలగించినట్లు ఆర్ఐ ధన్‌సింగ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తి ని హెచ్చరించినా స్పందించకపోవడంతో జేసీబీతో తొలగించామన్నారు.

◆ **సన్మానం**

నర్సాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేసి బదిలీపై వెళ్లిన రవీందర్‌ను కాలేజీ లెక్చరర్లు, విద్యార్థులు బుధవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రవీందర్‌తో పాటు బదిలీ అయిన లెక్చరర్లు శ్రీహరి, జానకిలను కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన శేషాచారి, ఇతర లెక్చరర్లు విద్యార్థులు సన్మానించారు.

చేగుంట(తూప్రాన్): చిన్నశివునూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్‌మెన్ బాలయ్య ప్రమోషన్‌తో బదిలీపై వెళ్తుండటంతో సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం బాలయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ రాములు, సబ్‌ఇంజనీర్ వంశీ, లైన్‌మెన్లు స్వామి, చంద్రమౌళి, శ్రీనివాస్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

◆ **ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు పత్రాలు సమర్పించాలి**

చేగుంట(తూప్రాన్): ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు పత్రాలను సమర్పించాలని ఎంపీడీఓ చిన్నారెడ్డి తెలిపారు. చేగుంట గ్రామ పంచాయతీలో సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. 2020లో మండలంలో 1250 మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా తగిన పత్రాలను గ్రామ పంచాయతీలో అందిస్తే పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు యాప్‌లో నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి నరేష్ సిబ్బంది ఉన్నారు.

◆ **కొనసాగుతున్న ఫీవర్ సర్వే**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యసిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. బుధవారం మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆదేశాలతో మండలంలోని కంచన్‌పల్లిలో ఏఎన్‌ఎం సుగుణ ఇంటింటికీ తిరిగి ఫీవర్‌తో పాటు జలుబు, ఇతర వ్యాధులకు సంబంధించి సర్వే చేశారు.

◆ **ఉపాధ్యాయులకు వీడ్కోలు**

వెల్దుర్తి(తూప్రాన్): ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎఫ్ఏఓ విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు.

◆ **ఆన్‌లైన్ సర్వే ఆశ వర్కర్లతో చేయించొద్దు**

మెదక్ కలెక్టరేట్: బీసీజీ ఆన్‌లైన్ సర్వే ఆశా వర్కర్లతో చేయించొద్దని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ ప్రభుత్వాన్ని అన్నారు. బుధవారం సమస్యలతో కూడిన వినతి పత్రం సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏఓ నవీన్‌కు అందజేశారు. అధికారులు స్పందించి ఆశల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ యూనియన్ నాయకురాలు గంగమణి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.